క్లుప్తంగా

అధికారులకు ప్రశంసాపత్రాలు



అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): తణుకు మండలం దువ్వలో 330 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు కృషి చేసిన గృహ నిర్మాణ శాఖ అధికారులను కలెక్టరు పి.ప్రశాంతి అభినందించారు. మంగళవారం వశిష్ఠ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో గత నెల రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ జిల్లా గృహోత్సవం సందర్భంగా తణుకు మండలం దువ్వలో 330 ఇళ్లు పూర్తి చేసి, గృహ ప్రవేశాలకు కృషి చేసిన గృహ నిర్మాణ శాఖ ఈఈ బి వెంకటరమణ, డీఈ కేకేడీ ప్రసాదు, ఏఈ కె వెంకటరెడ్డిని అభినందించి, అమరావతి నుంచి వచ్చిన ప్రశంశా పత్రాలను కలెక్టరు పి.ప్రశాంతి వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ డా.ఆర్సీ ఆనంద కుమార్, తదితర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

యనమదుర్రు కార్యదర్శిపై ఈవోపీఆర్డీ విచారణ

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని యనమదుర్రు గ్రామ కార్యదర్శి జీవీ సత్యకుమార్‌పై మంగళవారం ఈవీపీఆర్డీ జీవీ నానేశ్వరరావు విచారణ చేపట్టారు. గతంతో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి సంబంధించి గతంలో జనసేన వార్డు మెంబర్లు స్పందన ద్వారా కలెక్టర్ పి. ప్రశాంతి దృష్టికి తీసుకువెళ్లడంతో విచారణ చేపట్టారు. ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఈవోపీఆర్‌డీ నానేశ్వరరావు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు మృతి



వెంకటేశ్వరరావు (ఫైల్)

కాళ్ల: కాళ్ళ మండలం దొడ్డనపూడి గ్రామ పంచాయతీ కార్యదర్శి చెలంకూరి వెంకటేశ్వరరావు (52) దొడ్డనపూడి గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తుండగా అనారోగ్య కారణాలతో సెలవులో ఉన్నారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో భీమవరంలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. ఈయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఆయన భీమవరం మండలం, తుందుర్రు, లోసరి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహించారు. వెంకటేశ్వరరావు మృత దేహాన్ని భీమవరంలోని ఆయన సొంత ఇంటికి తరలించారు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ వెంకటేశ్వరరావు సోదరుడు చెలంకూరి వీర వెంకట సత్యనారాయణ(సీవీ) కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సంతాపం వ్యక్తం చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, భీమవరం జెడ్పీటీసీ కాండ్రేకుల నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, పలువురు ప్రముఖులు వెంకటేశ్వర మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నవరత్న పథకాలతో ప్రజలకు ఎంతో మేలు



ఉండిలో సంక్షేమ పథకాల బ్రోచర్లు అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్న పథకాల ద్వారా రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేకూరిందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తెలిపారు. మంగళవారం ఉండి నాల్గవ సచివాలయ పరిధిలో సర్పంచ్ కమతం సౌజన్య బెనర్జీ, ఉపసర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తూ వారికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందించిన సంక్షేమ పథకాల వివరాలను పీవీఎల్ తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతన్నను ఆదుకోవడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రతి పేదవాడిని లక్షాధికారిని చేస్తానని ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చి వారందరికీ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చారని అన్నారు. విద్య, వైద్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కి ప్రజలంతా అండగా ఉండాలని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆయనకు మద్దతుగా నిలిచి మరోసారి ఆయనను ఆశీర్వదించాలని పీవీఎల్ కోరారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి యేడిద వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు గులిపల్లి అచ్చారావు, కొత్రపాటి అనిత, కరిమెరక చంద్రరావు, రణస్తుల మహంకాళి, కరిమెరక శివనాగరాజు, కమతం బెనర్జీ, ఏఎంసీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, గ్రామపార్టీ అధ్యక్షుడు కరిమెరక మల్లికార్జున, పేరిచెర్ల సూర్యనారాయణరాజు, అందుకూరి రాజు, బడుగు బాలాజీ, అంగర రాంబాబు, శేషాద్రి శ్రీను, రాయి సతీష్, బొచ్చా అచ్చారావు, కన్నా సాహెబ్, మల్లువలస సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు వాహనం వేలం

ఆకివీడు: స్థానిక ఎక్సైజ్ శాఖ అధికారులు సీజ్ చేసిన వ్యాన్‌ను ఆకివీడు పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 8న వేలం వేస్తున్నట్లు ఎస్సై నాగబాబు మంగళవారం చెప్పారు.

పీఆర్-126 రకం వరి సాగు చేయవద్దు

పాలకోడేరు: ప్రస్తుత దాళ్వా సీజన్‌లో ఎక్కువ మంది రైతులు పీఆర్-126 వరి రకాన్ని సాగు చేయటానికి ప్రయత్నాలు చేస్తున్నారని, ఈ వరి రకం సాగును ప్రోత్సహించవద్దని ఉన్నతాధికారులు ఆదేశించారని మండల వ్యవసాయ అధికారి వి నారాయణరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ పీఆర్ 126 రకం సాగు చేస్తే ఆ ధాన్యాన్ని ప్రైవేట్‌గా విక్రయించుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

దుకాణాల్లో సోదాలు

తాడేపల్లిగూడెం: పట్టణంలోని దుకాణాలలో మంగళవారం మున్సిపల్ అధికారులు సోదా లు చేశారు. నిషేధించిన ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న దుకాణాల్లో వాటిని గమనించి అపరాధ రుసుములు విధించారు. 26 దుకాణాల నుంచి 22 కిలోల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని, 17,200 రూపాయలను అపరాధరుసుంగా వసూలు చేశారు. ఈ దాడుల్లో శానిటరీ అధికారులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి



భీమవరం ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న జర్నలిస్టులు



డీసీసీబీ చైర్మన్ పీవీఎల్‌ను సత్కరిస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు

సాక్షి, భీమవరం: రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పూర్తి అవగాహన ఉందని విడతల వారీగా వాటన్నింటినీ పరిష్కరిస్తారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో భీమవరంలోని అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులు మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయడానికి మంత్రివర్గంలో ఆమోదం తెలిపినట్లు చెప్పారు. 99 శాతం హామీలు అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. భీమవరం నియోజకవర్గంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని శ్రీనివాస్ చెప్పారు.

సీఎం జగన్ పాలనలో జర్నలిస్టులకు ప్రత్యేక స్థానం

కాళ్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాలతో పాటు జర్నలిస్టులకు కూడా ప్రత్యేక స్థానం ఇచ్చారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. కాళ్ల మండలం పెద అమీరం పార్టీ క్యాంపు కార్యాలయంలో పీవీఎల్‌ను ఉండి నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గుర్తింపు ఉన్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించడంపై జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ పీవీఎల్‌ను కలిసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో జర్నలిస్టులకు మేలు చేకూరుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యమైన పరిపాలన అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. జర్నలిస్టుల కోసం ప్రత్యేక ఆలోచన చేసి మూడు సెంట్లు స్థలం ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు ఆయనకు పూలమాలలు వేసి దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు.

11 నుంచి సర్వోదయ యువవాహిని కార్యక్రమం

సాక్షి, భీమవరం: జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఈనెల 11వ తేదీ నుంచి సర్వోదయ యువవాహిని కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్వోదయ మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు మంగళవారం తెలిపారు. సత్యం, అహింసా విధానాలపై గాంధీ మండపాలు, విద్యా సంస్థల్లో సదస్సుల్లో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. నిడమర్రు మండలం పెదనిండ్రకొలనులోని గాంధీభవన్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. నెల రోజుల పాటు పలు ప్రాంతాల్లో సదస్సులు నిర్వహిస్తామని ప్రసాదరాజు చెప్పారు.

పథకాలపై ఇంటింటికీ విస్తృత ప్రచారం



సచివాలయ సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జామి హైమావతి

ఆకివీడు: రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి ఎందుకు కావాలో సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు చెబుతారని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి చెప్పారు. రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహణ కోసం స్థానిక నగర పంచాయతీలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ ప్రతి వార్డులో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రభుత్వ పథకాలను వివరించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి ప్రతి వార్డులో నిర్వహించే కార్యక్రమాల్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కమిషనర్ జీ.కృష్ణమోహన్ మాట్లాడుతూ వలంటీర్లు ప్రజలకు పథకాలను వివరించాలన్నారు.ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలనకు ఉచిత వాహన సదుపాయం



భీమవరంలో వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: విస్సాకోడేరు లేఅవుట్‌లో జగనన్న కాలనీలో వేగంగా ఇళ్లు నిర్మిస్తున్నారని, వాటిని లబ్ధిదారులు పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఉచిత వాహన సదుపాయం కల్పించడం అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద ఆయన ఉచిత వాహన సదుపాయాన్ని మంగళవారం ప్రారంభించారు. విస్సాకోడేరు లే అవుట్‌లో 3,800 ఇళ్లు నిర్మించాల్సి ఉందని, వాటిని తారక రామా కనస్ట్రక్షన్స్ కంపెనీ చేపట్టగా కంపెనీ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఉచిత రవాణా సదుపాయాన్ని ఏర్పాటు చేసిందన్నారు. లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణ పనుల తీరుతెన్నులు, నాణ్యతను పరిశీలించేందుకు ఈ వాహనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ. 1.80 లక్షలు అందిస్తోందన్నారు. బ్యాంకు ద్వారా రుణాలు మంజూరు చేస్తోందని చెప్పారు. సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేకపోతున్న లబ్ధిదారులకు తారక రామా కనస్ట్రక్షన్స్ కంపెనీ చైర్మన్ పళ్ళ ఏసుబాబుతో సంప్రదించి ఇళ్ల నిర్మాణం అప్పగించామని శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహారాజు, మానుకొండ ప్రదీప్, గూడూరి ఓంకార్, పళ్ళ ఏసుబాబు, చెల్లబోయిన సూర్య ప్రకాష్, కోమటి రాంబాబు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించండి

ఆకివీడు: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించి తగిన వైద్యం పొందాలని ప్రముఖ వైద్యురాలు నోరి దత్తాత్రేయ చెప్పారు. మండలంలోని దుంపగడప వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ క్యాన్సర్ అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టీ.ఓగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథి, వైద్యుడు నోరి మాట్లాడుతూ మహిళలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు, పురుషులకు ఊపిరితిత్తులు, కాలేయం క్యాన్సర్‌కు గురవుతున్నాయని చెప్పారు. పొగాకు, ఆల్కహాల్, గుట్కా, కలుషితమైన ఆహారం తినడం ద్వారా క్యాన్సర్‌కు గురయ్యే అవకాశం ఉందని చెప్పారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయం వద్ద అన్న సమారాధన

ఆకివీడు: సమానత్వాన్ని చాటే విధంగా అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గురోతు విజయ్‌కుమార్ చెప్పారు. స్థానిక ఆనాల చెరువు వద్ద వీరాంజనేయ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం వద్ద దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా అన్నసమారాధన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి, ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు, కౌన్సిలర్ కిమిడి అరుణకుమారి, మాజీ ఉపసర్పంచ్ షేక్‌హుస్సేన్, డాక్టర్ మహేష్ వర్మ, వివిధ పార్టీల నాయకులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

నీటి వినియోగంపై అవగాహన ర్యాలీ



నీటి వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): దీన్ దయాళ్ అంత్యోదయ -జాతీయ పట్టణ జీవనోపాధుల మిషన్, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో భీమవరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని స్వయం సహాయక సంఘం సభ్యులతో నీటి దీపావళి కార్యక్రమం మంగళవారం వేండ్ర వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ శ్యామల మాట్లాడుతూ నీటి శుభ్రత విధానం, నీటి వినియోగం, స్వయం సహాయక సభ్యులకు అవగాహన కల్పిస్తామన్నారు. స్వయం సహాయక సభ్యులు అందరికీ నీలవర్ణంలో ఉన్న ఒక బ్యాగ్, వాటర్ బాటిల్, ఒక స్టీల్ గ్లాస్ ఒక కిట్ బహుమతిగా అందించారు. సభ్యులందరికీ మునిసిపల్ ఇంజినీర్ త్రినాథ్ రావు నీరు ఏవిధంగా నిల్వ చేసి, శుభ్రం చేస్తారో వివరించారు. స్వయం సహాయక సంఘ సభ్యులతో మెప్మా సిటీ మిషన్ మేనేజరు సీహెచ్ నాని బాబు జల్ దివాలి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏ ఈ సత్యనారాయణ మూర్తి, వాటర్ వర్క్స్ ఏఈ కృష్ణమూర్తి, డి ఈ శ్రీనివాస్, అమృత్ పీడీ ఎంసీ తిరుపాల్, పట్టణ సమాఖ్య ఓబీలు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్లో వైద్య సౌకర్యాలు భేష్



గొరగనమూడిలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎన్‌క్వాస్ బృందం

పాలకోడేరు: గ్రామంలో ఉన్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో సౌకర్యాలన్నీ ఉన్నాయి. సెంటర్‌కు వైద్యం చేయించుకోవడానికి వచ్చే రోగులకు సిబ్బంది అందుబాటులో ఉంటూ సేవలందించాలని జాతీయ నాణ్యత ప్రమాణాల అంచనా నిపుణులు (ఎన్‌క్వాస్ టీమ్) డా. సంగీతా సేన్, డా. భాగ్యవతి యతీష్ అన్నారు.. గొరగనమూడి గ్రామంలోని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను మంగళవారం ఎన్ క్వాస్ టీమ్ సభ్యులు పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు అందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శివాజీరాజు అందిస్తున్న సేవలను ఎన్‌క్వాస్ టీమ్ సభ్యులు తెలుసుకుని ఆయన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హసిత, ఎన్క్వాస్ టీమ్ సభ్యురాలు అనితతో పాటు జానకి రామరాజు, కార్యదర్శి పోలయ్య, వైద్య సిబ్బంది, సీహెచ్‌వో రమోలా, హెల్త్ అసిస్టెంట్ ఎం విజయప్రసాద్, ఎన్ఎన్ఎంలు, వేదకుమారి, సుజాత, ఆశావర్కర్లు శాంతి పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను మరోసారి గెలిపించుకుందాం

పాలకొల్లు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించే బాధ్యత దళిత, బహుజనులదేనని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. యాళ్లవానిగరువు గ్రామ సచివాలయ ఆవరణలో మంగళవారం డ్వాక్రా మహిళలు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం దళిత, బహుజనులకు రాజ్యాంగ ఫలాలు దక్కేలా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని చెప్పారు. ఐదేళ్లలో రూ.2.76 లక్షల కోట్లు సంక్షేమ ఫలాలు దళిత, బహుజనులకు అందించారన్నారు. బుధవారం గాంధీబొమ్మల సెంటర్‌లో నిర్వహించే సామాజిక సాధికార బస్సుయాత్రకు అందరూ తరలిరావాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నక్కా ఇర్మియారాజు, నాయకులు అంబటి శేషగిరి, మరపట్ల ప్రవీన్, నల్లి నాగరాజు, ఊటాల చిట్టిరాజు, సబ్బే శ్రీను తదితరులు పాల్గొన్నారు.